వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 177 | శుక్రవారం | 12 జనవరి 2024 | పేజీలు : 06 | వెల రూ. 5



2లో..

## కేయూ అక్రమాలపై యూజీసీ ఆరా..

వెంటనే రిపోర్ట్ పంపాలంటూ వీసీ, రిజిస్ట్రార్ లకు మెయిల్..

యూజీసీకి ఫిర్యాదు చేసిన అకుట్

వరంగల్ వాయిస్ కథనంతో కదిలిన యంత్రాంగం






# కడిగి పారేశారు..

కేటీఆర్ పై సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేటీఆర్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం సన్నాహక సమావేశాలో ఆయన తీరును కడిగి పారేసినట్లు సమాచారం. అబద్ధాల ముందు అభివృద్ధి ఓడిపోయింది.. నోటికి వచ్చిన వాగ్దానాలతో ప్రజలను కాంగ్రెస్ మోసగించిందంటూ సన్నాయి నొక్కులు నొక్కడంకంటే మనమెంత వరకు ప్రజలకు చేరువయ్యామనేది వెనక్కి తిరిగి చూసుకోవాలంటూ హితబోధ చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ప్రాణం ఇచ్చే కార్యకర్తలను సైతం తెలంగాణ భవన్ గడప కూడా దాటకుండా చేశారంటూ మండిపడినట్లు సమాచారం. మిమ్మల్ని కలవాలంటేనే ఎమ్మెల్యేలకు, నాయకులకే లాగు తడుస్తుంటే మాలాంటి కార్యకర్తలకు దిక్కెవరంటూ నిలదీసినట్లు ప్రచారం సాగుతోంది. పదవిలో ఉన్న పది సంవత్సరాల్లో ఏనాడైనా నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారా..వారి సాధకబాధకాల గురించి ఆలోచించారా, ఫోన్ చేసినా స్పందించారా అంటూ ప్రశ్నలతో కేటీఆర్ ను ఉక్కిరి బిక్కిరి చేసినట్లు వినికిడి. ఇప్పటికైనా దిద్దు బాటు చర్యలు చేపట్టకపోతే పార్టీ మనుగడే కష్టంగా మారుతుందంటూ సూచించినట్లు సమాచారం.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

## కేటీఆర్‌పై తిరుగు 'బావుటా'

మిమ్మల్ని కలవాలంటేనే.. ఎమ్మెల్యేలు, నాయకులకు లాగు తడుస్తుంటే

ఇక కార్యకర్తల పరిస్థితి ఏంటంటూ ప్రశ్న

ఎన్నడైనా పార్టీ శ్రేణులతో సమావేశం పెట్టారా..

కనీసం ఫోన్ చేసినా స్పందించారా..

వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో యువరాజును నిలదీసిన క్యాడర్

## అభివృద్ధి పనుల్లో పరుగులు పెట్టించాలి

జూన్ చివరి నాటికి పూర్తి చేయాలి

అధికారులతో ఎమ్మెల్యే కడియం



8లో



8లో

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

హాజరైన అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

## విద్యార్థిని ఆత్మహత్య

ఎస్సార్ క్యాంపస్ హాస్టల్‌లో ఘటన

గుట్టు చప్పుడు కాకుండా బాడీని తరలించిన యజమాన్యం



2లో..

# కడిగి పారేశారు..

**కేటీఆర్ పై తిరుగు 'బావుటా'**

**మిమ్మల్ని కలవాలంటేనే.. ఎమ్మెల్యేలు, నాయకులకు లాగు తడుస్తుంటే**

**ఇక కార్యకర్తల పరిస్థితి ఏంటంటూ ప్రశ్న**

**ఎన్నడైనా పార్టీ శ్రేణులతో సమావేశం పెట్టారా..**

**కనీసం ఫోన్ చేసినా స్పందించారా..**

**వరంగల్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో యువరాజును నిలదీసిన క్యాడర్**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఉద్యమాలకు పురిటి గడ్డ ఓరుగల్లు అని చెప్పుకోవడం తప్ప ఏనాడైనా ఇక్కడి



ఉద్యమ కారుల గురించి పట్టించుకున్నారా అంటూ బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావుపై స్థానిక నాయకులు, కార్యకర్తలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. కేటీఆర్ అధ్యక్షతన హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎంపి పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, తక్కలపెల్లి రవీందర్ రావు, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణిలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ అధ్యక్షులు, నాయకులు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.

### కడిగి పారేశారు..

సుమారు ఐదు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో కేటీఆర్ తీరును పార్టీ క్యాడర్ కడిగి పారేశారు. ఉద్యమమే లక్ష్యంగా ఏర్పడిన పార్టీలో మొదటి నుంచి నమ్ముకున్న వారికి పార్టీ చేసిందేమిటి అంటూ ప్రశ్నించినట్లు సమాచారం. పార్టీని, కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడంతోనే నేడు ఈ పరిస్థితి వచ్చిందంటూ మండిపడ్డారు. బీఆర్ ఎస్ కు బలమైన క్యాడర్ ఉన్న సంగతైనా మీకు గుర్తుందా అంటూ నిలదీశారు. పదవిలో పది ఏండ్లు ఉన్నప్పటికీ ఏనాడైనా కార్యకర్త గురించి పట్టించుకున్నా అంటూ మండిపడినట్లు సమాచారం. ఉద్యమమే ఊపిరిగా పార్టీ కోసం ప్రాణమున్నంత వరకు పనిచేసిన ఎంతో మంది ఉద్యమకారులు వివిధ కారణాలతో మృతి చెందితే కనీసం వారి చివరి చూపును కూడా పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యకర్తల సాదక, బాధకాలు తెలుసుకునేందుకు ఏనాడైనా ప్రయత్నించారా..కనీసం వారు మిమ్మల్ని కలిసేందుకు ఎంతో దూరం నుంచి వచ్చినా వారికి అవకాశం ఇచ్చారా..ఫోన్ చేసినా కూడా ఏనాడైనా స్పందించారా అంటూ నిలదీసినట్లు సమాచారం. నేటి



ఈ పరిస్థితికి కారణం మీరేనంటూ కేటీఆర్ ముఖంమీదే చెప్పినట్లు సమాచారం.

### స్థానికులు పట్టించుకోరూ..

నాయకులకు, కార్యకర్తలకు ఏదైనా ఆపద వచ్చినపుడు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పట్టించుకోరు..కనీసం మీరైనా అండగా నిలుస్తారని ఫోన్ చేస్తే మీరు కూడా పట్టించుకోకపోతే మా పరిస్థితి ఏంటని నిలదీసినట్లు సమాచారం. చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా రాజకీయ పార్టీ అండగా లేకుంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న చిన్న సమస్యలను కూడా మేయర్ పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించాల్సి వస్తుందంటూ కేటీఆర్ కు చెప్పుకొచ్చారు.

### భోజన సదుపాయం..

వరంగల్ బీఆర్ ఎస్ కార్యకర్తల సూచనతో తెలంగాణ భవన్ లో నిత్యం 200మందికి భోజన ఏర్పాట్లు చేయిస్తానంటూ కేటీఆర్ హామీ ఇచ్చినట్లు చెప్పుకొస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారు మూల ప్రాంతమైన ఏటూరు నాగారం నుంచి ఏదైనా సమస్యను మీతో చెప్పుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తే కలిసేందుకు మీరు సమయం ఇవ్వరు..వేరే వారు పట్టించుకోరంటూ తమలోని ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. దూర ప్రాంతాలనుంచి వారికోసమైన తెలంగాణ భవన్ లో నిత్యం భోజనాలు ఏర్పాటు చేయాలంటూ ఒక కార్యకర్త చేసిన సూచన మేరకు సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

### మనమే దూరం అయ్యాం..

ఉద్యమ పార్టీ అయిన టీఆర్ తోనే ప్రజలు ఉన్నారు. కాని మీరు మీ ఇష్టానుసారం పార్టీ పేరు మార్చి తెలంగాణ అస్తిత్వం లేకుండా చేస్తే ప్రజలు మనకు ఎట్లా చేరువవుతారంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీ పేరును తిరిగి టీఆర్ ఎస్ మార్చాలంటూ పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు నిమిషాలు మాట్లాడగా మరి కొందరు బీఆర్ ఎస్ తప్పిదాలపై అరగంటకు పైగా మాట్లాడినట్లు సమాచారం. అయితే కార్యకర్తలు సంధించిన ప్రశ్నలకు కేటీఆర్ కూడా స్పందించినట్లు పలువురు చెప్పుకొచ్చారు. కొన్ని తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే అని ఆయన అంగీకరించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో నిత్యం రెండు నుంచి మూడు గంటల పాటు కేటీఆర్ అందుబాటులో ఉండాలన్న సూచనకు కూడా ఆయన అంగీకరించినట్లు తెలిపారు.

### సురేష్ జోషికి హామీ..

సంబంధంలేని కేసులో తనను ఇరికించారంటూ కార్పొరేటర్ సురేష్ జోషి కేటీఆర్ కు వివరించారు. తనపై అట్రాసిటీ కేసు నమోదు చేసినా స్థానిక నాయకులెవ్వరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో స్థానిక నేతలపై కేటీఆర్ సీరియస్ అయినట్లు సమాచారం. సంబంధం లేని కేసులో ఇరికించినా ఎందుకు స్పందించడంలేదంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉండి ప్రయోజనం ఏంటన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇష్యూను ఎమ్మెల్యేలు లేని ప్రాంతంలో ఎమ్మెల్సీలు సీరియస్ గా తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. మీటింగ్ అయ్యాక వరంగల్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సురేష్ జోషి ఇష్యూపై తనను కలువాలంటూ ఆదేశించినట్లు సమాచారం.

# కేయూ అక్రమాలపై యూజీసీ ఆరా..

**వెంటనే రిపోర్ట్ పంపాలంటూ వీసీ, రిజిస్ట్రార్‌లకు మెయిల్..**

**యూజీసీకి ఫిర్యాదు చేసిన అకుట్**

**వరంగల్ వాయిస్ కథనంతో కదిలిన యంత్రాంగం**




**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై యూజీసీ ఆరా తీస్తోంది. కేయూలో గత రెండున్నరేళ్ళలో వీసీ, రిజిస్ట్రార్ ల అవినీతి, అక్రమాలతోపాటు టీచర్లపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్న తీరుపై అకుట్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వివరించామని ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే క్రమంలో యూజీసీకి కూడా ఫిర్యాదు చేయడంతో యూజీసీ వెంటనే స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతిపై వెంటనే రిపోర్ట్ పంపాలని వీసీ, రిజిస్ట్రార్ లకు గురువారం మెయిల్ చేసినట్లు అకుట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అకుట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పది సంవత్సరాలు అనుభవం లేకున్నా కేయూకు వీసీగా ప్రొఫెసర్ టి.రమేశ్ ను నియమించడంతో అనేక అక్రమాలు జరిగాయన్నారు. యూనివర్సిటీ చట్టానికి విరుద్ధంగా రిటైర్డ్ ప్రొఫెసర్ ను రిజిస్ట్రార్ గా నియమించారని, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా, యూనివర్సిటీ యాక్ట్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా 16 మంది అనుబంధ అధ్యాపకులను నియమించి నెలకు రూ.8 లక్షల ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని, అర్హత ఉన్న వారిని పక్కనబెట్టి అక్రమంగా తమ అనుయాయులకు సీనియర్ ప్రొఫెసర్ గా ప్రమోషన్లు ఇచ్చారని, ఆర్ట్స్ కాలేజీలో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను క్యాంపస్ కు బదిలీ చేయించుకొని, కీలకమైన విభాగాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా నియమించి అక్రమాలకు తెరలేపారని, వివిధ విభాగాలలో పనిచేసే టీచర్లపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ, రొటీన్ గా వచ్చే విభాగ అధిపతి, బీవోఎస్ చైర్మన్, డీన్ లాంటి వాటిని కూడా తమకు ఇష్టం ఉన్న వారికి ధారపోసి అక్రమాలకు పాల్పడుతున్నారని, భూముల కబ్జా దారులను ప్రోత్సహిస్తున్నారని, పీఎచ్ డీలో అనేక అవకతవకలకు పాల్పడడం ద్వారా యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చారన్నారు. వీటిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని యూజీసీకి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య

**ఎస్సార్ క్యాంపస్ హాస్టల్‌లో ఘటన**

**గుట్టు చప్పుడు కాకుండా బాడీని తరలించిన యజమాన్యం**



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని అన్నసాగర్ ఎస్ ఆర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ రెండో సంవత్సరం చదువుతున్న రాథోడ్ దీప్తి (20) క్యాంపస్ హాస్టల్ లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కనీసం తల్లిదండ్రులు, పోలీసులు వచ్చేవరకు కూడా ఆగకుండా మృతదేహాన్ని హాస్టల్ యజమాన్యం హుటాహుటిన ఎంజీఎం మార్చురీకి తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి దీప్తి బ్రేక్ ఫాస్ట్ కు రాకపోవడంతో పాటు హాస్టల్ గది డోర్ కొట్టినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగుల కొట్టి చూడగా ఆమె ఉరివేసుకొని కనిపించిందని హాస్టల్ వర్గాలు వెల్లడించాయి. గుట్టు చప్పుడు కాకుండా బాడీని తరలించడంపై తోటి విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో అర్ధరాత్రి ఉరివేసుకొని ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు హసన్ పర్తి సీఐ గోపి తెలిపారు.



**సమగ్ర విచారణ జరిపించాలి :**

**– హ్యూమన్ రైట్స్ ఉమెన్ ప్రొటెక్షన్ స్టేట్ ఆక్టివ్ మెంబర్ సాగంటి మంజుల**

ఎస్సార్ క్యాంపస్ లో ఆత్మహత్యకు పాల్పడిన రాథోడ్ దీప్తి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని హ్యూమన్ రైట్స్ ఉమెన్ ప్రొటెక్షన్ స్టేట్ ఆక్టివ్ మెంబర్ సాగంటి మంజుల డిమాండ్ చేశారు. ఎంజీఎం మార్చురీలో ఉన్న ఆమె మృతదేహాన్ని పరిశీలించి, సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# వివేకానందుడి ఆశయాలు అనుసరణీయం



**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్**

**ఆయన సేవలు కొనియాడిన ప్రముఖులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వామి వివేకానంద ప్రపంచానికి చూపించిన మార్గం ఎంతో ఆదర్శనీయమని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా హనుమకొండలోని బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆలోచనలను యువత ఆచరించి ఉన్నత వ్యక్తులుగా తయారు కావాలన్నారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను పాశ్చాత్య దేశాలకు వివరించినటువంటి మహనీయుడని అన్నారు. యువత మేలుకో దేశాన్ని ఏలుకో అని అన్న మహెూన్నత వ్యక్తి ఆయని కొనియాడారు. నేటి యువత స్వామి వివేకానంద జీవిత చరిత్రను తెలుసుకొని ఆయన సూత్రాలను అనుసరించాలన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, సమయపాలన, నీతి, నిజాయితీ వంటివి పాటించాలని, ప్రపంచం మేచ్చేలా మహెూన్నత వ్యక్తిగా ఎదగాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు, కార్పొరేటర్ లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్బీ కళాశాలలో..

లాల్ బహదూర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ హాజరయ్యారు. దేశ నిర్మాణానికి మూల స్తంభం లాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి స్వామి వివేకానంద అనేక దేశాలలో అనేక రకాలైన ఉత్తేజకర ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.రాఘవేందర్ రెడ్డి, హింగే రాజేశ్వరరావు, ఉమ్మగొని శ్రీనివాస్, అధ్యాపకులు మాధురి, రాణి, మమత, అఫ్జల్, సుజాత, సునీత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

### జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో..

హనుమకొండలోని జేఎన్ ఎస్ ఇండోర్ స్టేడియంలో స్వామి వివేకానంద 161 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ కోచ్ లు నరేందర్, శ్రీమాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జాతీయ యూత్ అవార్డి ఆకులపల్లి మధు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్చార్జి నయీమ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వృత్తి నైపుణ్య శిక్షణ సిబ్బంది, క్రీడా శాఖ కోచులు, సిబ్బంది, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

### పాపయ్యపేట చమన్‌లో..

సనాతన భారతీయ ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప తత్వవేత్త, నిత్య చైతన్య స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పాపయ్యపేట చమన్ లోని వివేకానంద భారీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యుఎంసీ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, మాజీ మేయర్ గుండా ప్రకాశరావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ రామా తేజస్విని శిరీష్, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఏనుగుల రాకేష్ రెడ్డి, రత్నం సతీష్ సా, మదూరి వేదప్రకాష్, గుముడవెల్లి సత్యనారాయణ తదితరులు వివేకానంద విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కీర్తిశేషులు రాయబారపు వెంకటేశ్వర్లు స్మారకార్థం ఆయన కుమారులు వినోద్, దయానంద్ వెయ్యి మందికి అన్నదానం చేశారు.

ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు రాయభారపు వినోద్, దయానంద్, శ్రీరాం శివాజీ, జట్లింగ్ ఎల్లోసా, రమేష్, దివ్వేల పూర్ణ, శ్రీనివాస్ రెడ్డి, అజీమ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### హనుమకొండలో..

నేటి యువత వివేకానందుడి జీవితాన్ని స్ఫూర్తి గా తీసుకొని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర, వరంగల్ పోలీస్ కమిషనరేట్, కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు.

### ఏవీవీ కళాశాలలో..

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జన్మదిన, ఆయన విశ్వ మానవాళికి అందించిన సూక్తులు, ప్రసంగాలు, బోధనలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ భూజేందర్ రెడ్డి హాజరు కాగా కళాశాల అధ్యాపకులు సంజీవ, వి.శ్రీధర్, బి.గోపి, జి.శ్రీనివాస్, చండీశ్వర్, సునీల్, అశోక్, సీరియల్ వాలంటీర్స్ ప్రవీణ్, అశోక్, సుతేజ్ ధనలక్ష్మి, రియాజ్, శ్రావ్య ,కరిష్మా, నికిత, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

### చింతల్‌లో..

36 డివిజన్ చింతల్ లోని వీనస్ పబ్లిక్ హై స్కూల్లో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా బీజేపీ ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నిర్భయులూ, నిస్వార్థపరులూ, మానవ సేవకు కట్టుబడి ఉండాలంటూ యువతరానికి బోధించాడన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెక్రటరీ, ఉపాధ్యాయులు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.













## ఎల్ఐసీ వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్ గా విజయ కుమార్



### ఖమ్మంలో ఏకగ్రీవంగా ఎన్నిక

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్‌గా జనగామ జిల్లా బ్రాంచ్ కు చెందిన పి.విజయ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన 140 ఎల్ ఐసీ డెవలప్మెంట్ ఆఫీసర్ యూనియన్ రెండో సంవత్సరం ద్వైపాక్షిక సార్వత్రిక ఎన్నికలను శుక్రవారం ఖమ్మంలోని డీపీఆర్ సీ బిల్డింగ్ లో నిర్వహించారు. ఈ ఎన్నికలకు యూనియన్ అఖిల భారత అధ్యక్షుడు వినయ్ బాబు, అఖిల భారత ఐఆర్ డీఏ రెసిడెంట్ సెక్రెటరీ రాం కుమార్, సౌత్ సెంట్రల్ జోన్ (ఆంధ్ర, తెలంగాణ) జనరల్ సెక్రెటరీ డీవీవై శివ ప్రసాద్, డివిజనల్ కరీంనగర్ వాసుదేవ రెడ్డి, సికింద్రాబాద్ కృష్ణ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పి.విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ గా వరంగల్ సిటీ బ్రాంచ్ కు చెందిన ఎం.రమేష్, జనరల్ సెక్రటరీగా మహబూబాబాద్ బ్రాంచికి చెందిన పి.ఉపేంద్ర నరసింహా రావు, జాయింట్ సెక్రటరీలుగా పి.రోహన్ రెడ్డి ( ఖమ్మం), ఆర్.వెంకటేశ్వర్లు (భద్రాచలం), ట్రెజరర్ గా పి.సురేందర్ రావ్ (నర్సంపేట), రెసిడెంట్ సెక్రటరీగా ప్రకాష్ రావ్ (వరంగల్ సిటీ బ్రాంచ్), జేసీసీ మెంబెర్స్ గా కె.మారుతి రాజు (కొత్తగూడెం), జె.సాంబ శివరావ్ (జనగాం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు 2024జనవరి నుంచి 2026 జనవరి వరకు పదవుల్లో కొనసాగనున్నారు. ఈ సమావేశంలో ఎల్ ఐసీ వరంగల్ డివిజన్ అత్యున్నత అధికారి సుబ్రమణ్యం పాల్గొన్నారు.



## జేపీసీ క్యాలెండర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో శుక్రవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జేపీసీ క్యాలెండర్ ను టీవీ జేపీసీ కో కన్వీనర్ బైరపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడంతోపాటు డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ సుగుణాకర్ రాజు, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి కాజా షరీఫ్ హాజరై ప్రసంగించారు. స్టాఫ్ నర్సులకు జీవో నెంబర్ 317 ప్రకారం అలాట్మెంట్ చేస్తూ ఉత్తర్వులు రాగలవని చెప్పారు. ఈ నెల 20లోపు జిల్లా క్యాడర్ పోస్టులను అలాట్మెంట్ చేస్తూ జీవో నెంబర్ 317 అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీవీపీ విభాగం ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ ఎండి నదీమ్, ఇన్చార్జి నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, హెడ్ నర్స్ స్వరూప రాణి, స్టాఫ్ నర్సులు కె.లక్ష్మి, స్వర్ణలత, నాగమణి, అరుణ, కుమారి సైదా, పారామెడికల్ నుంచి ఎండి సలీం, భాస్కర్, రమేష్, మహేష్, రాంప్రసాద్, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దిమేడారం జాతరకు పటిష్ట ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలసి అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** మద్దిమేడారం జాతరకు అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నాగరాజుపల్లె శివారులో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలసి కాలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ గోనె శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతర సమయంలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలని సూశించారు. ప్రధానంగా ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ అధికారులకు జాతర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమాయత్తం చేశారు. ప్రధానంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు రోడ్డు మార్గం గుంతలమయం కావడంతో ములుగు కలెక్టర్ తో చర్చించి రోడ్డు పునరుద్దరణకు నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ 1973లో ప్రారంభమైన మద్దిమేడారం సమ్మక్క సారలమ్మలను కోరిన కోర్కెలు తీర్చే అమ్మవార్లుగా ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నందున జాతరకు ప్రతి ఏటా భక్తులు పోటెత్తున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని జాతరను విజవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యతతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో క్రిష్ణవేణి, డీసీపీ రవిందర్, తహసిల్దార్ రాజేష్, ఏసీపీ తిరుమల్, సీఐ కాషన్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ ప్రకాష్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కూచన ప్రకాష్, ఎస్సై నైనాల నగేష్, ఆలయ ట్రస్ట్ చైర్మెన్ సీతారాంరెడ్డి, పూజారులు దురిశెట్టి సమ్మయ్యతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. సంక్రాంతి ముగ్గుల పోటీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మరుగునపడుతున్న సంక్రాంతి వైభవానికి ప్రాణం పోయాలనే చిన్న ప్రయత్నంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని దర్గా కాజిపేట, సోమిడి, హనుమకొండ చౌరస్తాలోని బ్రహ్మణవాడ, రెడ్డికాలని, పెగడపల్లి డబ్బాలలో దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీని నిర్వహించినట్లు ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్, 60వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తం 300 మంది మహిళలు, యువతులు పాల్గొని ఉత్సాహంగా సంక్రాంతి సంప్రదాయాన్ని మైమరిపించే విధంగా ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల వేదికలను అభినవ్ భాస్కర్ సందర్శించి ఉత్సాహంగా పాల్గొన్న అడబిడ్డలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకనాడు సంక్రాంతి అంటే పెద్ద పెద్ద ముగ్గులు, గొబ్బెమ్మలు, డూ.. డూ బసవన్నల సన్నాయి సప్పుళ్ల మధ్య ఘనంగా సంక్రాంతి పండుగను జరుపుకునేదని కానీ నేటి సమాజంలో ఆ సంబరం ఎక్కడో కొరవడిందన్నారు. అందుకే ఈ ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంక్రాంతి తరువాత మనకు జనవరి 22న మళ్ళీ దీపావళి పండుగ వస్తుందని అది అయోధ్య రామయ్య ప్రాణ ప్రతిష్ట రూపంలో జరుగుతుందని కాబట్టి రామయ్యకు ఘన స్వాగతం పలకాలని అభినవ్ భాస్కర్ కోరారు. అనంతరం నక్కలగుట్టలోని ఫౌండేషన్ కార్యలయంలో అన్ని ప్రాంతాల విజేతలుగా నిలిచిన 20 మందికి మొదటి బహుమతిగా ఐదు వేలు, రెండవ బహుమతిగా మూడు వేలు, మూడవ బహుమతిగా రెండు వేలు, ప్రత్యేక బహుమతిగా వెయ్యి రూపాయల నగదు పురస్కారాన్ని, జ్ఞాపికను అందించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్న అందరికి ప్రత్యేక కానుకలు అందించారు. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన లయన్స్ క్లబ్ పద్మజాదేవి బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేతలు, ఫౌండేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ సంగెం నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షుడిగా కిరణ్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** గీసుకొండలో శుక్రవారం టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ ఆధ్వర్యంలో సంగెం తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం, తాలూకా కమిటీ ఎన్నికలను ఎన్నికల అధికారి పాలకుర్తి సదానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంగెం యూనిట్ లోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరి సమక్షంలో సంగెం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గజ్జెల రామ్ కిషన్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఉద్యోగులు తమ హక్కులతో పాటు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా సంగెం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా ఎ.కిరణ్, కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా అర్జున్, కిరణ్, సత్యరాజ్, సతీష్, కళ్యాణి, శాలిని, జాయింట్ సెక్రటరీలుగా షుక్రుమియా, సందీప్, ప్రేమ్ సాగర్, సాంబయ్య, స్వరూప, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవీందర్, రంజిత్, ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా శంకర్, కార్యవర్గ సభ్యులుగా రఘు, ప్రసాద్, స్వరూప,రత్నవల్లి కవికుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, సంయుక్త కార్యదర్శులు చందర్ రావు, మధు, చిరంజీవి యూనిట్ కోశాధికారి నాగేశ్వరరావు, తాలూకాలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

### గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

### జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** అధికారులు ప్రణాళిక ప్రకారం గ్రామస్థాయిలో అభివృద్ధి పనులు నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఇంటింటికీ తాగునీరు సరఫరాపై వారీగా పూర్తిస్థాయిలో నివేదికను గ్రామాల వారీగా ఈ నెల 17న ఎంపీడీవోలు సమర్పించాలని ఆదేశించారు. ఈజేఎస్ లో వర్కర్లకి 100 రోజులు పని కల్పించాలన్నారు. ప్రతీ గ్రామంలో ఒక రోజుకి మినిమం 50 మందిని పనిలోకి తీసుకోవాలన్నారు. వాటికి సంబంధించిన వివరాలన్నింటిని వీక్లీ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. పనులన్నింటినీ సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 17న మొదటి గ్రామ సభ, 20న రెండో గ్రామ సభ నిర్వహించాలన్నారు. జనవరి 31 వరకు టాక్స్ 100 శాతం చెల్లింపులు జరగాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా 100 శాతం సేకరించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పర్మర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికి మరుగుదొడ్ల నిర్మాణం 100 శాతం పూర్తవ్వాలని, సక్రమంగా సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ లెవెల్ లో అన్ని విభాగాల్లో 70శాతం పనులలో పురోగతి సాధించాలన్నారు.ఈ నెల 25 లోగా పంచాయతీలు వారి ప్లాన్ లను అప్ లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో రంగాచారి, సీపీఓ ఇస్మాయిల్, డీఆర్డీవో మొగులప్ప, జిల్లా, మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.


# పల్లె దీపాలు పాటల పుస్తకం ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కుమారపల్లి, హనుమకొండ ఆవరణలో ప్రముఖ రచయిత, కవి, గాయకుడు సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు చిలువేరు శ్రీనివానులు రచించిన 'పల్లె దీపాలు'పాటల పుస్తకాన్ని ప్రముఖ తెలుగు పరిశోధకులు, ఆచార్యులు ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవి, రచయిత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్ రావు, రిటైర్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ్ కుమార్, డాక్టర్ కుందూరు సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, సోషల్ ఫోరం జిల్లా అధ్యాక్షులు తాటిపాముల రమేష్, ట్రెజరర్ ఆమంచ రవికుమార్, మహేందర్, గౌసియా, అనేక మంది ఉపాధ్యాయులు, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

# ఇరగదీసిన మహేశ్ బాబు

## మదర్ సెంటిమెంట్‌తో త్రివిక్రమ్ టచ్





సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కోసం ఎదురు చూస్తున్న మహేష్ అభిమానులకు 14 ఏళ్ల తరువాత 'గుంటూరు కారం' సినిమా రూపంలో అవకాశం వచ్చింది. వాళ్ళిద్దరి కలయికలో వచ్చిన మూడో సినిమా ఇది, ఇందులో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. ప్రకాష్ రాజ్, మురళి శర్మ, రావు రమేష్, రాహుల్ రవీంద్రన్ ఇతర తారాగణం. సంక్రాంతి పండగ సందర్భంగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ పండగకి విడుదలైన చిత్రాల్లో అత్యధిక బడ్జెట్ పెట్టిన సినిమా ఇదే. సినిమాపై ముందునుంచే భారీ అంచనాలు ఉండడంతో థియేటర్ల వద్ద అభిమానుల సందడి కనిపించింది. వెంకటస్వామి (ప్రకాష్ రాజ్) ఒక రాజకీయనాకుడు, అతని కుమార్తె వసుంధర (రమ్యకృష్ణ) కూడా రాజకీయాల్లోకి వచ్చి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుంది. వసుంధరకి మొదట సత్యం (జయరాం) తో వివాహం అవుతుంది వాళ్ళకి పుట్టిన కుమారుడు రమణ (మహేష్ బాబు). కానీ పూర్లో గొడవలు రావటం అందులో ఆమె భర్త ఉండటంతో, భర్తని, కొడుకుని గుంటూరులో వదిలేసి హైదరాబాదులో వున్న తన తండ్రి దగ్గరికి వచ్చేస్తుంది వసుంధర. అక్కడే రెండో సారి నారాయణని (రావు రమేష్) పెళ్లిచేసుకుంటుంది. వాళ్ళకి రాజగోపాల్ (రాహుల్ రవీంద్రన్) అని కుమారుడు ఉంటాడు. వెంకటస్వామి తన నిజమైన వారసుడు రాజగోపాల్ అని చెప్పుకుంటూ అతన్ని కూడా ఎన్నికల్లో పోటీ చేయించడానికి సమాయత్తం అవుతూ ఉంటాడు. అయితే మొదటి వారసుడు రమణని హైదరాబాదు పిలిపించుకొని తనకి ఆస్తి అవసరం లేదు అని, వసుంధరకి తనకి సంబంధం లేదని దస్తావేజు కాయితాల మీద సంతకం పెట్టమని చెపుతూ ఉంటాడు. వెంకటస్వామి వకీలు పాణి (మురళి శర్మ) రమణతో ఎలా అయినా సంతకం పెట్టిస్తాను అని చెప్పి తన కూతురు అమ్ములు (శ్రీలీల)ని గుంటూరు పంపిస్తాడు. అమ్ములు, బాలు (వెన్నెల కిషోర్) తో గుంటూరు వెళుతుంది, కానీ ఆమె రమణతో ప్రేమలో పడుతుంది. ఇంతకీ రమణ సంతకం పెట్టాడా? రమణకి, తల్లి వసుంధర అంటే ఎందుకు కోపం? వెంకటస్వామి తన



రాజకీయ భవిష్యత్తు కోసం ఎటువంటి రాజకీయ ఎత్తులు వేసాడు? చివరికి ఏమైంది అనే విషయాల కలబోతే'గుంటూరు కారం' సినిమా. తల్లి సెంటిమెంట్ నేపధ్యంగా ఎంచుకొని సరదాగా సాగుతూ, మధ్యలో మహేష్ బాబుతో డాన్సులు, పోరాట సన్నివేశాలు చేయిస్తూ మొదటి సగం పూర్తి చేయిస్తాడు. ఇక రెండో సగంలో కథ గురించి ఒక్కొక్కటీ విప్పుకుంటూ వెళతాడు. జయరాం, మహేష్ బాబు తండ్రీ కొడుకులు, ఎందుకు గుంటూరులో వున్నారు, మహేష్ బాబు, తల్లి రమ్యకృష్ణను కలుద్దాం అని వస్తే ఆమె ఎప్పుడూ అతన్ని కలవదు. ఒకరంటే ఒకరికి పడనట్టు వున్నా, వాళ్ళిద్దరి మధ్య వుండే ఆ తల్లి కొడుకుల అనుబంధాన్ని, వాళ్ళ మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలని బాగా చూపించగలిగాడు త్రివిక్రమ్.

# సూపర్‌మేన్‌కు తక్కువేంకాదు..

అంజనాద్రి అనే వూరిలో హనుమంతు (తేజ సజ్జ) అతని అక్క అంజమ్మ (వరలక్ష్మి శరత్ కుమార్) వుంటారు. హనుమంతు ఆ వూర్లో అల్లరి చిల్లరిగా తిరుగుతూ ఉంటాడు. ఆ వూరికి హనుమంతు చిన్నప్పటి స్నేహితురాలు మీనాక్షి (అమృత అయ్యర్) డాక్టర్ గా చదువు పూర్తి చేసుకొని వస్తుంది. అదే వూరిలో వున్న ఒక బలమైన వస్తాదు ఆ వూరిలో దోపిడీ దొంగతనాలు చేయించి ప్రజలను భయభ్రాంతులను చేస్తూ ఉంటాడు. ఒకసారి మీనాక్షి వెళుతున్న బస్సు మీదకి దోపిడీ దొంగలు వస్తే, అందరూ అడివిలోకి పారిపోతారు.ఆ సమయంలో హనుమంతు వచ్చి మీనాక్షిని కాపాడతాడు, అదే సమయంలో దొంగలు హనుమంతుని పొడిచి అక్కడ నదిలో పడేస్తారు. హనుమంతు నీటి అడుగుకి కొట్టుకుపోతున్నప్పుడు అతనికి ఒక మణి దొరుకుతుంది, తరువాత దెబ్బలతో నది ఒడ్డుకు కొట్టుకొచ్చిన అతన్ని ఆ ఊరి ప్రజలు ఇంటికి చేరుస్తారు, కట్లు కడతారు, కానీ అతను కోలుకోవటం కష్టం అంటారు. మణి ప్రభావంతో హనుమంతుకి దెబ్బలు మాయం అయిపోతాయి, ఒక్కసారిగా సూపర్ మాన్ లా తయారవుతాడు. అదే సమయంలో మైకేల్ (వినయ్ రాయ్) అనే అతను అతని అసిస్టెంట్ (వెన్నెల కిషోర్) తో ఆ మణి గురించి తెలిసి అది కాజేయాలని, ఆ వూరికి వస్తారు. ఇంతకీ మైకేల్ ఎవరు? అతను ఎందుకు ఈ మణిని చేజిక్కుంచుకోవాలని అనుకున్నాడు? ఆ మణి నేపధ్యం ఏంటి? సూపర్ మేన్ గా మారిన హనుమంతు ఆ వూరికి ఏమి చేసాడు? అంజమ్మ పాత్ర ఏంటి? ఇవన్నీ 'హనుమాన్' సినిమాలో రంగరించారు. హాలీవుడ్ లో 'సూపర్ మేన్', 'స్పైడర్ మేన్', 'బాట్ మేన్' ఇంకా చాలా సూపర్ మాన్ కథలతో సినిమాలు వచ్చాయి. ప్రశాంత్ వర్మ భారతీయ పురాణం అయిన రామాయణంలోని హనుమాన్ పాత్రని తీసుకొని ఒక కథను తయారు చేసి ఈ 'హనుమాన్' సినిమా నిర్మించాడు. హాలీవుడ్ సూపర్ మేన్ లతో పోలిస్తే ఇది మన పురాణం నుండి తీసుకున్న మన సూపర్ మేన్ కథ.



# ప్రపంచవ్యాప్తంగా విడుదలైన కెప్టెన్ మిల్లర్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వరుస సినిమాలతో అభిమానులకు ఊపిరాడకుండా చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ స్టార్ హీరో టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం కెప్టెన్ మిల్లర్.అరుణ్ మథేశ్వరన్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 1600కుపైగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. కాగా కెప్టెన్ మిల్లర్ తెలుగు విడుదల తేదీపై ఏదో ఒక వార్త నెట్టింట హల్ చల్ చేస్తూనే ఉంది. తాజాగా ఈ చిత్రం తెలుగులో ఎప్పుడు విడుదలవుతుందని తెలియజేస్తూ కొత్త డేట్‌ను ప్రకటించారు. కెప్టెన్ మిల్లర్ తెలుగు రాష్ట్రాల్లో జనవరి 25న విడుదల కానున్నట్టు వెల్లడించారు. ఈ చిత్రాన్ని తెలుగులో సురేశ్ ప్రొడక్షన్స్, ఏషియన్ సినిమాస్ గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాయి. ధనుష్, శివరాజ్‌కుమార్, ప్రియాంక మోహన్ తమ యాక్టింగ్‌తో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది. విప్లవయోధుడు కెప్టెన్ మిల్లర్ స్ఫూర్తితో వస్తోన్న ఈ మూవీలో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ , టాలీవుడ్ యాక్టర్ సందీప్ కిషన్, నివేదితా సతీశ్, అమెరికన్ యాక్టర్, ఆర్ఆర్ఆర్ ఫేం ఎడ్వర్డ్ సొన్నెన్‌బ్లిక్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు.. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. సత్య జ్యోతి ఫిలిమ్స్ తెరకెక్కిస్తున్న కెప్టెన్ మిల్లర్ ఆడియో రైట్స్‌ను పాపులర్ మ్యూజిక్ లేబుల్ సరిగమ సొంతం చేసుకుంది.



# ఓటిటిలోకి వచ్చేసిన సర్కారు నౌకరి



ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమైన సినిమా 'సర్కారు నౌకరి' సినిమా జనవరి 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో పాజిటివ్ టాక్‌నే సొంతం చేసుకున్న ఈ సినిమా.. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రంగా ప్రశంసలు అందుకుంది. ఆకాష్ సరసన భావన హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని ఆర్కే టెలీ షో బ్యానర్ పై దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు నిర్మించారు. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా విడుదలైన 10 రోజులకే ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో జనవరి 12 నుండి ఈ సినిమా స్ట్రీమిగ్ అవుతోంది. 'సర్కారు నౌకరి' కథ విషయానికి వస్తే.. మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన గోపాల్ (ఆకాష్)కు గవర్నమెంట్ ఉద్యోగం వస్తుంది. తన చుట్టు పక్కల ఉండే గ్రామాల్లో నిరోధ్ వాడటం గురించి అవగాహన కల్పించి.. నిరోధులను ప్రజలకి అందుబాటులోకి తీసుకువచ్చే జాబ్ అది. అయితే ఈ ఉద్యోగం తన భార్య సత్య (భావన)కి నచ్చదు. దీంతో తను కావాలో.. ఉద్యోగం కావాలో తేల్చుకోమని ఇల్లు వదిలి వెళ్ళిపోతుంది. వాళ్ల మధ్య గొడవకి కారణం, కండోమ్‌లు పంచుతున్న తన భర్తని ఆ ఊరి వాళ్లంతా హేళన చేయడం.. వాళ్లని అంటరానివాళ్లుగా చూస్తుండటంతో జాబ్ మానేయమని పోరు పెడుతుంటుంది. అయితే గోపాల్ మాత్రం జాబే కావాలనేంతగా తన భార్యను నిర్లక్ష్యం చేస్తాడు. అందుకు కారణం ఏమిటి? ఆకాశ్ గతం ఏమిటి? 90sలో ఎయిడ్స్‌పై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉండేది? చివరికి గోపాల్ తన 'సర్కారు నౌకరి'తో ఎలాంటి పోరాటం చేశాడు? తద్వారా ఏం సాధించాడనేదే సినిమా కథ.



# ముందస్తు సంక్రాంతి సంబరాలు

## హాజరైన అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బన్ను న్యూరో హెల్త్, రీహాబిలిటేషన్ ఇనిస్టిట్యూట్ లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలందరికీ అడిషనల్ కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వారితో గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి వాతావరణం పల్లెటూరిని తలపించేలా ఉందన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు చిన్ననాటి నుంచే తెలిసేలా చేశారన్నారు. పిల్లలకు బోగి పండ్లను పోయడంతోపాటు వారితో కలిసి పతంగులను ఎగురవేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు.విద్యార్థులు పతంగులు ఎగరవేసి ఉత్సాహంగా గడిపారు. హరిదాసుల వేషదారుణలో పలువురు విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో బన్ను స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.కిరణ్ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముగ్గుల పోటీ..

కాజీపేట మండలం ఏఆర్ ఆర్ నగర్ లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముగ్గుల పోటీలు మతసామరస్యానికి ప్రతీకలన్నారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసమల్ల దీన, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ శంకర్, ధర్మసాగర్ మండల సీపీఐ కార్యదర్శి కొట్టేపాక వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి బండ్లోజు రాజమణి, వెన్నెల, ప్రతిభ, ఎస్.పద్మ, బి.ఉష, లావణ్య, వనజ, మౌనిక, సన తదితరులు పాల్గొన్నారు.

### రేపు ముగ్గుల పోటీ..

వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 13న హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి విజేతకు రూ.2,116 , రెండో బహుమతిగా రూ.1,116, మూడో విజేతకు రూ.516 ప్రోత్సహక నగదు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేవారికి గిఫ్ట్ లు అందచేస్తామన్నారు. ఇతర వివరాలకు 83673 56765 , 83670 56765 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నిరంజన్

## అవకాశం ఇవ్వాలంటూ పార్టీ ప్రముఖులకు విజ్ఞప్తి

## సానుకూలంగా పార్టీ ఇంచార్జులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ విద్యార్థి వ్యవస్థాపకుడు, కేయూ అధ్యాపక నాయకుడైన తనకు వరంగల్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని మేధావి డాక్టర్ బి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పార్టీ తూర్పు, పశ్చిమ ఇంచార్జులు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, వర్ధన్నపేట ఇంచార్జి ఆరూరి రమేష్, భూపాల్ పల్లి ఇంచార్జి గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ భవన్ కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు ముఖ్య నాయకులను స్వయంగా కలిసి వినతి పత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ ఇంచార్జులు కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు ప్రకటించారు. మొదటి నుంచి విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న మీకే వరంగల్ ఎంపీ టికెట్ రావడం సమంజసంగా ఉంటుందంటూ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

# నడకతో సంపూర్ణ ఆరోగ్యం

## 303 రీజియన్ కౌన్సిలర్ కుమారస్వామి గౌడ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నడక ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని ఇంటర్నేషనల్ వాకర్స్ 303 రీజియన్ కౌన్సిలర్ తడక కుమారస్వామి గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఏవీవీ జూనియర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాక మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఐడి కార్డుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తడక కుమారస్వామి గౌడ్ హాజరై వాకర్స్ కు ఐడి కార్డ్స్ అందజేయడంతో వాటి ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఏవీవీ వాకార్స్ అస్సోషియేషన్ చేసిన సేవలను గుర్తించి వాకర్స్ ఇంటర్నేషనల్ లో బెస్ట్ క్లబ్ అవార్డు రావడం సంతోషకరమన్నారు. ఈ అవార్డు మీ సేవను గుర్తించి ఇచ్చినట్లు వెల్లడించారు. ఇలాగే ముమ్ముందు కూడా మంచి మంచి కార్యక్రమాలు చేసి వాకర్స్ ఇంటర్నేషనల్ లో మంచి అవార్డ్స్ తీసుకోవాలని కోరారు. అనంతరం ఏవీవీ వాకర్ అసోసియేషన్, వాలీబాల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో కుమారస్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాకం మనోహర్ బాబు, కార్యదర్శి సుధాకర్, డిప్యూటీ గవర్నర్ కరుణాకర్, వాకర్స్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో పరుగులు పెట్టించాలి


## జూన్ చివరి నాటికి పూర్తి చేయాలి

## అధికారులతో ఎమ్మెల్యే కడియం

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో పరుగులు పెట్టించాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకర్గంలోని పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులపైన ఇంజనీరింగ్ అధికారులతో హన్మకొండ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సూపరింటెండెంట్ ఇంజనీర్ తో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంజీఎస్ వై, సీఆర్ ఆర్, ఎంఆర్ ఆర్, సీడీపీ నిధుల ద్వారా మంజూరైన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నత్తనడకన నడుస్తున్న పనుల పురోగతిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంజూరైన పనులు ఎక్కువ శాతం ప్రారంభం కాకపోవడం తో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లను పిలిచి ఏజెన్సీలను నిర్ణయించి పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ నెల 31 న సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో చేసిన పనులను రికార్డ్ చేయాలని ఆదేశించారు. పనులను చేసే క్రమంలో నాణ్యతను పాటించాలని కోరారు. అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించి ఏజెన్సీలను సమన్వయం చేసుకొని జూన్ 2024 వరకు మొత్తం పనులను పూర్తి చేయాలని ఆధేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఈఈ, డీఈలు పాల్గొన్నారు. మళ్ళీ నెల రోజుల తర్వాత అధికారులు, ఏజెన్సీలు ప్రజా ప్రతినిధులతో సమీక్ష చేద్దామని కడియం శ్రీహరి వెల్లడించారు.

# ఆహారంపై శ్రద్ధ అవసరం

## మిల్లెట్ కుకింగ్ ఎక్స్‌పర్ట్ కుసుమ కవిత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత ముఖ్యంగా అమ్మాయిలు ఆహారం పట్ల తగినశ్రద్ధ వహించాలని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ, మిల్లెట్స్ హబ్ నిర్వాహకురాలు మిల్లెట్ కుకింగ్ ఎక్స్పర్ట్ కుసుమ కవిత తెలిపారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకొని చక్కని ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఎదగాలన్నారు. యువజన దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫాస్ట్ ఫుడ్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను యువత ఆరోగ్యంగా ఎంచుకుంటే ఎదగటానికి ఉపయోగపడుతుందన్నారు. త్వరలో నగరంలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులకు వీటి పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి ఓ ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కుసుమ సురేష్, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మరణిస్తూ మరో ఐదుగురికి ప్రాణ దానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తాను మరణించినప్పటికీ మరో ఐదుగురికి ప్రాణం పోశాడు గీసుగొండకు చెందిన కర్ణకంటి శ్రీకాంతా చారి. బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవ దానం చేసి ఐదుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. గీసుగొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు కర్ణకంటి శ్రీకాంతా చారి హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్ లో ఉద్యోగం చేస్తున్నాడు. అనుకోకుండా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చికిత్స పొందుతూ మరణించాడు. కాగా తన కళ్ళు, గుండె, కిడ్నీ, లివర్ ను దానం చేసి మరో ఐదుగురికి ప్రాణం పోశాడు శ్రీకాంతా చారి. కేర్ ఆసుపత్రి యాజమాన్యం, గ్రామ ప్రజలు అతనికి ఘనంగా నివాళులర్పించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com